# నమస్తే తెలంగాణ

## మహబూబ్‌నగర్
## నారాయణపేట

3 | మహబూబ్‌నగర్, శనివారం 7 డిసెంబర్ 2024 | MAHABUBNAGAR NARAYANPET


- వట్టెం పంప్‌హౌస్‌లో ఐదు మోటర్లు సిద్ధం
- మొదటి మోటర్ డ్రైరన్ విజయవంతం
- ఈ వానకాలంలో నీటమునిగిన పంప్‌హౌస్
- డీవాటరింగ్‌కు నయాపైసా ఇవ్వని సర్కారు
- సీఎం రేవంత్ దృష్టి సారించకపోవడంతో ఎక్కడికక్కడే నిలిచిన పనులు
- ముఖ్యమంత్రి సొంత జిల్లాలో పాలమూరు ప్రాజెక్టుకు గ్రహణం
- ఈ వానకాలంలో వరద భారీగా వచ్చినా కృష్ణా జలాలన్నీ సముద్రంపాలైన వైనం..

# పంపులు రెడీ.. మరి ప్రారంభమెప్పుడు?




వట్టెం పంప్‌హౌస్‌లో గురువారం డ్రైరన్‌ను ప్రారంభిస్తున్న అధికారులు

మహబూబ్‌నగర్, డిసెంబర్ 6 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మిస్తున్న వట్టెం రిజర్వాయర్‌లో ఐదు బాహుబలి పంపులను మన ఇంజినీర్లు రెడీ చేశారు. గురువారం మొదటి పంపు విజయవంతంగా పరీక్షించడంతో ఇంజినీర్ల ఆనందం అంతా ఇంత కాదు. మిగతా నాలుగు పంపులు కూడా డ్రైరన్‌కు సిద్ధంగా ఉన్నట్లు ఇంజినీరింగ్ అధికారులు ప్రకటించారు. పాలమూరు పథకంలో భాగంగా ప్రధానమైన పాత్ర పోషించే వట్టెం రిజర్వాయర్ పూర్తి కావడం.. పంప్‌హౌస్‌లోని మోటార్లన్నీ సిద్ధం కావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ రిజర్వాయర్ నుంచి కృష్ణా జలాలు ఉమ్మడి మహబూబ్‌నగర్‌తోపాటు పాటు రంగారెడ్డి, నల్లగొండ జిల్లాలకు వెళ్తాయి. భవిష్యత్‌లో రాజధాని నగరానికి కూడా తాగునీరు అందించేందుకు ఉద్దేశించిన ఈ పథకం కీలక ఘట్టం పూర్తి కావడం.. ఈ పథకానికి శ్రీకారం చుట్టిన కేసీఆర్ ప్రయత్నం సఫలీకృతమైంది.

### ప్రాజెక్టుపై దృష్టిసారించని సర్కారు

రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం పాలమూరు ప్రాజెక్టుపై శ్రద్ధ పెట్టడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. సాక్షాత్తు సీఎం రేవంత్ సొంత జిల్లాలో సుమారు 13 లక్షల ఎకరాలకు నీరు అందించే ఈ బృహత్ పథకానికి గ్రహణం పట్టించడం గమనార్హం. కాగా ఇటీవల కురిసిన వర్షాలకు కృష్ణానది ఉప్పొంగి వందలాది టీఎంసీల నీరు సముద్రం పాలైంది. మన జిల్లాకు వాడుకునే అవకాశం ఉన్నప్పటికీ ఆ ప్రయత్నం జరగకపోవడంతో ఏపీ కృష్ణానది జలాలను భారీ ఎత్తున తరలించుకుపోయింది. ఫలితంగా పాలమూరు ఎత్తిపోతల పథకం పనులు దాదాపు 80 శాతం పూర్తయినా కాంగ్రెస్ సర్కారులో అడుగడుగునా నిర్లక్ష్యం కనిపిస్తోంది. అయినప్పటి కీ గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన నిధులతోనే వట్టెం పంప్‌హౌస్ రిజర్వాయర్ పనులు పూర్తి కావడం అప్పటి ప్రభుత్వం చిత్త శుద్ధిని తెలియజేస్తోంది.

### పీఆర్‌ఎల్‌ఐకి గ్రహణం : మర్రి



రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టినా పాలమూరు ఎత్తిపోతలను పట్టించుకోకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోందని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. ఎక్కడ కేసీఆర్‌కు పేరొస్తుందోనన్న భయంతో ఈ పథకాన్ని ప్రస్తుత ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. రైతులకు సాగునీరు.. గ్రామాలకు తాగునీరు అందించే ఈ బృహత్తర పథకానికి ప్రభుత్వం నిధులు విడుదల చేయకుండా కాలయాపన చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఇటీవల మహబూబ్‌నగర్‌లో సీఎం, మంత్రులందరినీ ప్రాధేయపడి రూ.లక్ష కోట్లు ఐదేళ్లలో తీసుకొస్తానని చెప్పారని.. దాంట్లో పదో వంతు పాలమూరు ప్రాజెక్టుకు కేటాయిస్తే పనులు పూర్తయి 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. వట్టెం రిజర్వాయర్ పంపులు పూర్తిస్థాయిలో బిగించిన అధికారులు, ఇంజినీర్లకు ఆయన అభినందనలు తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వంలో విడుదల చేసిన నిధుల ద్వారా అని ఇప్పటివరకు పనులు పూర్తయ్యాయని.. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకానికి పూర్తిస్థాయిలో నిధులు విడుదల చేసి రైతులకు సాగునీరు ఇవ్వకపోతే చరిత్రలో రేవంత్ జిల్లాకు మొండిచేయి చూపినవారిగా నిలిచిపోతారని ఎద్దేవా చేశారు.

### సస్యశ్యామలం చేసేందుకు..

కరువు కాటకాలతో వలసలకు నిలయమైన పాలమూరు జిల్లాను సస్యశ్యామలం చేయాలని ఉద్దేశంతో కేసీఆర్‌ఈ ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టారు. కొల్లాపూర్ సమీపంలోని నార్లాపూర్ వద్ద పాలమూరు ఎత్తిపోతల పథకం పంప్‌హౌస్ నిర్మించి రోజుకు రెండు టీఎంసీలు ఎత్తిపోసే విధంగా దీన్ని డిజైన్ చేశారు. అక్కడి నుంచి నార్లాపూర్ రిజర్వాయర్‌కు చేరిన నీళ్లు ఆ తర్వాత ఏదుల రిజర్వాయర్‌కు వెళ్తాయి. వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లా సరిహద్దుల్లో ఉన్న ఏదుల వరకు గ్రావిటీ ద్వారా తరలించి.. అక్కడి నుంచి ఎత్తిపోస్తారు. ఏదుల రిజర్వాయర్‌లో సుమారు 9 టీఎంసీల నీటిని నిల్వ చేసే విధంగా డిజైన్ చేశారు. అక్కడి నుంచి గ్రావిటీ ద్వారా నాగర్‌కర్నూల్ జిల్లాలోని వట్టెం పంప్ హౌస్‌కు చేరతాయి. ఇక్కడ ఎత్తిపోసిన నీళ్లు వట్టెం రిజర్వాయర్లు నిల్వ చేస్తారు. సుమారు 19 టీఎంసీల నీటి నిల్వ చేసే విధంగా భారీ రిజర్వాయర్ నిర్మించారు. ఇక్కడి నుంచి గ్రావిటీ ద్వారా కరివెన రిజర్వాయర్‌లోకి నీళ్లు మళ్లిస్తారు. కరివెన రిజర్వాయర్ కెపాసిటీ 19 టీఎంసీలు కాగా మరికొంత పెంచేందుకు వెసులుబాటు కూడా ఉన్నది. అక్కడి నుంచి ఉదండాపూర్ పంప్‌హౌస్‌కు గ్రావిటీ ద్వారా తరలించి ఉదండాపూర్ రిజర్వాయర్‌కు ఎత్తిపోస్తారు. ఇక్కడి నుంచి నారాయణపేట జిల్లా.. రంగారెడ్డి జిల్లా.. వికారాబాద్ జిల్లాతోపాటు నల్లగొండ జిల్లాలకు సాగు, తాగునీరు అందించనున్నారు. ఈ ప్రాజెక్టుతో ఉమ్మడి పాలమూరు జిల్లాలో గరిష్ఠంగా రూ.13 లక్షలు.. కనిష్ఠంగా రూ.10 లక్షల ఎకరాలు సాగవుతాయి. బీఆర్‌ఎస్ హయాంలో ఈ పథకం పనులు శరవేగంగా సాగినా.. గతేడాది పనులన్నీ ఎక్కడికక్కడ నిలిచిపోయాయి.

### వట్టెం పంప్‌హౌస్ మునగడంతో భారీ నష్టం

ఈ ఏడాది వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలకు వట్టెం పంప్‌హౌస్‌లోకి భారీగా వరద నీరు చేరి పెద్ద ఎత్తున నష్టం వాటిల్లింది. నాగర్‌కర్నూల్ జిల్లా సమీపంలోని నాగనూలు చెరువు అలుగు పారి గొలుసు కట్టు చెరువుల వరదకు నీళ్లన్నీ పోటెత్తి సమీపంలోని వట్టెం పంప్‌హౌస్ సొరంగంలోకి మళ్లిపోయాయి. దీంతో 24 గంటల్లోనే వట్టెం పంప్‌హౌస్ మొత్తం నీట మునిగింది. దాదాపు పది నుంచి 12 టీఎంసీల నీరు చేరడంతో భారీ నష్టం సంభవించింది. ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో.. పనులన్నీ నత్తనడకన సాగాయి. నీళ్లను తోడేందుకు కూడా నయాపైసా విధించలేదు. పైగా ఒక్క మంత్రి ఎమ్మెల్యే కూడా పంప్ హౌస్ సందర్శించకపోవడం తీవ్ర విమర్శలకు తావిచ్చింది.

### అన్ని అడ్డంకులు దాటి..

వట్టెం పంప్‌హౌస్‌లో మొత్తం 10 బాహుబలి మోటార్లు బిగించారు. 9 మోటర్లు నీటిని ఎత్తిపోసే విధంగా డిజైన్ చేశారు. ఒక మోటర్‌ను స్పేర్‌గా ఉంచారు. ఈ పది మో టర్లలో ఐదు మోటర్లు పూర్తిస్థాయిలో రెడీ చేశారు. రాష్ట్రం లోని ప్రతిష్ఠాత్మక సంస్థ అయిన బీహెచ్‌ఈఎల్ ఈ మోటర్లను డిజైన్ చేసింది. అక్కడే స్పేర్ పార్ట్స్ తయారుచేసి పంప్‌హౌస్‌లోని నాలుగు అంతస్తు లోపలికి తీసుకెళ్లి బిగించారు. ఒక్కో మోటరు 24 గంటల్లో ఒక టీఎంసీని ఎత్తిపోస్తుంది. ఈ విధంగా 10 మోటర్లు సిద్ధమయ్యాయి. దాదాపు సగం మోటర్లు పూర్తి కావడంతో వట్టెం పంపు పూర్తిగా వాడుకోవచ్చు. ఒక పంపు ట్రయల్‌రన్ అధికారులు సక్సెస్‌ఫుల్‌గా పరీక్షించి చూశారు. మిగతా పంపులకు కూడా ఒకటి, రెండు రోజుల్లో డ్రైరన్‌ను పూర్తి చేస్తామని పాలమూరు ప్రాజెక్టులోని పరిధిలోని వట్టెం సర్కిల్ ఈఈ పార్థసారథిరెడ్డి 'నమస్తే తెలంగాణ'కు వివరించారు. మొత్తంపైన వట్టెం రిజర్వాయర్ కంప్లీట్ కావడంతో అన్నదాతల సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

**పాలమూరు ప్రాజెక్టుపై**
**కేసీఆర్ చెరగని ముద్ర**



వట్టెం పంప్‌హౌస్‌లో సిద్ధమైన మోటర్లు



అలంపూర్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే విజయుడు

# దేశానికి రాజ్యాంగాన్ని అందించిన మహనీయుడు అంబేద్కర్

- అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్ చౌరస్తా, డిసెంబర్ 6 : దేశానికి రాజ్యాంగాన్ని అందించిన మహనీయుడు డాక్టర్ భీంరావ్ అంబేద్కర్ అని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. శుక్రవారం అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకొని అలంపూర్ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బాబా సాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగ నిర్మాతగానే కాకుండా సామాజిక సామరస్యానికి కృషి చేసిన వ్యక్తి అని కొనియాడారు. దళిత కుంటుబం నుంచి వచ్చి అణగారిన వర్గాలకు చెందిన ప్రజల ప్రయోజనాలకు మద్దతు ఇవ్వడంతో భారత రాజకీయాల్లో అత్యంత ముఖ్యమైన వ్యక్తులలో ఒకరిగా నిలిచారన్నారు. అంబేద్కర్ గొప్ప ఆర్థికవేత, న్యాయనిపుణుడు, రాజకీయవేత్త, సంఘ సంస్కర్త అని, ఆయన జీవితాంతం దళిత జాతి సంక్షేమం, స్వేచ్ఛ కోసం కృషి చేశారని వెల్లడించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బంధువు అంత్యక్రియల్లో ఆర్‌ఎస్పీ



పుల్లూరులో పాడే మోస్తున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, ఎమ్మెల్యే విజయుడు

- ఎమ్మెల్యే విజయుడుతో కలిసి పాడె మోసిన ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

అలంపూర్ చౌరస్తా, డిసెంబర్ 6 : ఉండవెల్లి మండలంలోని పుల్లూరు గ్రామానికి చెందిన సంజన్న అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే విజయుడుతో కలిసి గ్రామానికి చేరుకొని సంజన్న కుటుంబ సభ్యులను పరామర్శించారు. సంజన్న ఆర్‌ఎస్పీకి బంధువు కావడంతో ఎమ్మెల్యేతో కలిసి పాడె మోసి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. అంతకు ముందు ఎమ్మెల్యే విజయుడు మండలంలోని కలుగొట్లకు చెందిన రాముడు అనారోగ్యంతో మృతి చెందడంతో గ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని చూపిస్తున్న రైతు దంపతులు

# రైతులపై ప్రకృతి కన్నెర్ర

- అకాల వర్షంతో తడిసిన ధాన్యం
- నేలకొరిగిన వరి పంట
- ఆందోళనలో కర్షకులు

కోడేరు, డిసెంబర్ 6 : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం వల్ల కోడేరు మండలంలో శుక్రవారం సాయంత్రం కురిసిన ఈదురు గాలులతో కూడిన అకాల వర్షానికి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయ్యింది. వర్షపు నీటిలో కొంత ధాన్యం కొట్టుకుపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా కోతకు సిద్ధంగా వరి పంటలు నేలకొరిగి దెబ్బతిన్నాయి. రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంటలు చేతికొచ్చే సమయంలో ప్రకృతి కన్నెర్ర చేయటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మండలకేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద కోడేరుకు చెందిన పొడెండ్ల నాగరాజు అనే రైతుకు చెందిన ధాన్యాన్ని శుక్రవారం తూకం వేసిన 54 బస్తాలు ఆరుబయట ఉంచగా వర్షానికి తడిసిపోయింది. అదేవిధంగా కృష్ణయ్య, కు రుమూర్తి అనే రైతుల ధాన్యం తేమశాతం ఎ క్కువగా ఉండటంతో గోదాం వద్ద ఆరబోశా రు. సాయంత్రం అకాల వర్షం కురియడంతో ధాన్యం తడిసి పోవడంతోపాటు వర్షపు నీటిలో కొట్టుకుపోయింది. దీంతో రైతు కృష్ణయ్య తన భార్య తడిసిన ధాన్యాన్ని చూపుతూ కన్నీటి పర్యంతమయ్యారు. మరో పక్క పంట పొలాల్లో కోతకు సిద్ధంగా ఉన్న పంటలు చాలా వరకు నేలకొరగడంతో రైతులు ఏం చేయాలో పాలుపొని పరిస్థితి ఏర్పడింది. పంట నీట మునగడంతో గింజలు మొలకెత్తే అవకాశం ఉందని అకాల వర్షంతో పంటలు ఆరబెట్టుకునే పరిస్థితి కూడా లేకుండా పోయిందని వారు వాపోతున్నారు.

ప్రభుత్వం స్పందించి అకాల వర్షానికి తడిసిన ధాన్యానికి, నీటి మునిగిన పంటలకు నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

# విద్యా వ్యవస్థను భ్రష్టుపట్టిస్తున్నారు..

- గురుకులాలను సందర్శిస్తే సీఎంకు ఎందుకు భయం
- నిర్బంధాలతో పాలన కొనసాగించలేరు
- సమస్యలు తెలుసుకునేందుకు వెళ్తున్న బీఆర్‌ఎస్వీ నాయకులను అరెస్టు చేయడం శోచనీయం
- జిల్లా గురుకులబాట ఇన్‌చార్జి, బీఆర్‌ఎస్వీ నేత కుర్వ పల్లయ్య





బీఆర్‌ఎస్వీ నాయకులను అరెస్టు చేసి అయిజ పోలీస్ స్టేషన్‌కు తరలించిన దృశ్యం

అయిజ, డిసెంబర్ 6 : కేసీఆర్ పదేండ్ల కాలంలో విద్యకు స్వర్ణయుగం తెచ్చారని, ఏడాది కాంగ్రెస్ పాలనలో విద్యా వ్యవస్థను భ్రష్టుపట్టిస్తున్నదని జిల్లా గురుకుల బాట ఇన్‌చార్జి, బీఆర్‌ఎస్వీ నేత కుర్వ పల్లయ్య ఆరోపించారు. ఏడాది ప్రజా పాలనలో సీఎం రేవంత్‌రెడ్డి పాఠశాలలు, గురుకులాలను అధఃపాతాళానికి తొక్కి విద్యా వ్యవస్థను సర్వనాశనం చేస్తున్నాడని దుయ్యబట్టారు. గురుకులబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అయిజ పట్టణంలోని కేజీబీవీ గురుకుల పాఠశాలను సందర్శించి, సమస్యలను తెలుసుకునేందుకు వెళ్తున్న బీఆర్‌ఎస్వీ నాయకులను గేటు బయటనే అడ్డుకున్న పోలీసులు వారిని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా గురుకుల బాట ఇన్‌చార్జి కుర్వ పల్లయ్య మాట్లాడుతూ శాంతియుతంగా గురుకులాలను సందర్శించి విద్యార్థుల సమస్యలు తెలుసునేందుకు వెళ్తున్న తమను ముందస్తుగానే పోలీసులతో అడ్డుకొని గురుకులాల్లో నెలకొన్న సమస్యలు బహిర్గతం కాకుండా ప్రభుత్వం చూస్తుందని ఆరోపించారు. రాష్ట్రంలోని గురుకులాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించకుండా విద్యార్థులను పొట్టనపెట్టుకుంటుందన్నారు. ప్రజా పాలనలో ప్రజాప్రతినిధులు, అధికారులు తనిఖీ చేయకుండా నాణ్యమైన విద్య, భోజనం ఏ విధంగా అందుతుందన్నారు. ఎల్లవేళలా అధికారులు, ప్రజాప్రతినిధులు తనిఖీలు చేస్తేనే వంట ఏజెన్సీలు నాణ్యమైన భోజనం అందిస్తారని, అలా కాకుండా ప్రభుత్వమే తనిఖీలు చేయకుండా విద్యార్థుల ప్రాణాలను బలి తీసుకుంటుందన్నారు. నాడు తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులను బలితీసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం, నేడు గురుకులాల్లో విద్యాభ్యాసం చేస్తున్న 48మంది విద్యార్థులను పొట్టనపెట్టుకుందని విమర్శించారు. గురుకులాలను సందర్శిస్తే సీఎం ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. గురుకులాల్లోని సమస్యలు ఎక్కడ బహిర్గమవుతాయోనని భయం పట్టుకుందన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలను ప్రతి ఒక్కరికీ ప్రశ్నించే హక్కు ఉందని, ఆ హక్కులను కాలరాసే హక్కు ఎవరికీ లేదన్నారు. పోలీసులతో నిర్బంధాలను విరమించుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డిని హెచ్చరించారు. అనంతరం సొంత పూచీకత్తుపై నాయకులను విడుదల చేశారు. అలాగే మండలంలోని ఉప్పల జెడ్పీహెచ్‌ఎస్‌ను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ నాయకులు మత్తాలి, కుర్వ వీరేశ్, మాధవ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్‌ఎస్ నేతల నిర్బంధం

- ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పలు చోట్ల ముందస్తు అరెస్టులు
- హైదరాబాద్‌కు వెళ్లకుండా అడ్డగింత



బీఆర్‌ఎస్ నాయకులను అరెస్టు చేసి నాగర్‌కర్నూల్ పీఎస్‌కు తరలించిన పోలీసులు

బీఆర్‌ఎస్ నేతలను అడుగడుగునా పోలీసులు అడ్డుకున్నారు. మాజీ మంత్రి హరీశ్‌రావు, హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిరెడ్డి, గులాబీ పార్టీ నేతల అరెస్ట్ నిరసనగా శుక్రవారం హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమానికి బీఆర్‌ఎస్ పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని పార్టీ నేతలు తరలకుండా నిర్బంధించారు. పలు చోట్ల ముందస్తు అరెస్టులు చేసిన పోలీసులు వారిని స్టేషన్లకు తరలించారు. అనంతరం సొంతపూచీకత్తుపై వారిని విడుదల చేశారు.పాడి కౌశిక్‌రెడ్డి ప్రశ్నించాడని ఆయన్ను గృహనిర్బంధం చేసి దౌర్జన్యంగా ఇంటి తలుపులు పగులగొడుతూ అరెస్టు చేయాలనుకోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. హరీశ్‌రావును అరెస్టు చేశారంటే మీ పాలనకు చరమగీతం పాడే రోజులు దగ్గరపడినట్లే అని హెచ్చరించారు. ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తారా..? అంటూ నిలదీశారు. ప్రజాపాలన పేరుపై నయా రజాకార్ల రాజ్యం మళ్లీ వచ్చిందని పలువురు ధ్వజమెత్తారు. తెలంగాణలో రేవంత్‌రెడ్డి సర్కారు జులూం పెరిగిందని ఆరోపించారు. ప్రభుత్వ అణచివేత ధోరణిని ప్రజలు గమనిస్తున్నారని, బుద్ధిచెప్పే రోజులు దగ్గరపడ్డాయన్నారు. నిర్బంధాలతో బీఆర్‌ఎస్ శ్రేణులను కట్టడి చేయలేరన్నారు.

– నెట్‌వర్క్ మహబూబ్‌నగర్, డిసెంబర్ 6

# యాసంగికి సాగునీటి కేటాయింపులు

- జోగుళాంబ గద్వాల జిల్లాలో 79,550 ఎకరాలకు నీళ్లు
- సాగునీటి ప్రణాళిక సిద్ధం చేసిన అధికారులు
- రాష్ట్రస్థాయి ప్రణాళిక కమిటీలో నిర్ణయం



జూరాల ప్రాజెక్టు

గద్వాల, డిసెంబర్ 6 : యాసంగిలో పంటలు సాగు చేసే రైతులకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. సాగయ్యే పంటలకు సాగునీరు అందించాలని రాష్ట్ర స్థాయి సాగునీటి విడుదల ప్రణాళిక కమిటీలో నిర్ణయం తీసుకున్నారు. నీటి పారుదల శాఖ ఈఎన్‌సీ అనిల్‌కుమార్ అధ్యక్షతన మంగళవారం జలసౌధలో సమావేశమైన కమిటీ ప్రాజెక్టుల వారీగా నీటి లభ్యత ఎగువ నుంచి రానున్న ప్రవాహాన్ని అంచనా మేరకు నిర్ణయించారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో వివిధ ప్రాజెక్టుల కింద యాసంగిలో సుమారు 79,550 ఎకరాలకు సాగునీరు అందనున్నది. దీంతో రైతన్నలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది వానకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవడంతో జిల్లాలోని జూరాల, నెట్టెంపాడ్, ఆర్డీఎస్ ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. ప్రస్తుతం ఆయా ప్రాజెక్టుల్లో ఉన్న నీటి లభ్యత ఆధారంగా ప్రభుత్వం యాసంగి పంటలకు నీళ్లు ఇవ్వాలని డిసైడ్ అయ్యింది.

### గత సీజన్‌లో క్రాప్ హాలీడే..

గత యాసంగి సీజన్‌లో వర్షాలు అనుకున్న స్థాయిలో కురవక పోవడంతో ప్రాజెక్టులు నీళ్లులేక వట్టిబోయాయి. ఎగువన ఉన్న అల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టుల్లో నీరులేక పోవడంతో ఆ ప్రాజెక్టుల కింద పంటలకు క్రాప్‌హాలీడే ప్రకటించారు. జిల్లాలో ఉన్న జూరాల, నెట్టెంపాడ్ పరిధిలోని గుడ్డెందొడ్డి, ర్యాలంపాడ్ రిజర్వాయర్‌లో నీరు ఇంకిపోవడంతో 15 ఏండ్ల తర్వాత మొదటిసారి గతేడాది యాసంగిలో జిల్లాలోని రైతులు పంటలు సాగు చేయక క్రాప్ హాలీడే ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి ఏడాదిలోనే వర్షాలు కురవకపోవడం రైతులు ఇబ్బందులు పడ్డారు. దీనితోడు వానకాలం సీజన్‌కు సంబంధించి రైతులకు ప్రభుత్వం రైతు భరోసా ఇవ్వకపోవడం.. యాసంగి సీజన్‌లో క్రాప్ హాలీడే ప్రకటించడంతో కర్షకులు ఆందోళన చెందారు. ప్రస్తుత వానకాలం సీజన్‌లో వర్షాలు సమృద్ధిగా కురవడంతోపాటు పంటలు బాగా పండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అదే సంతోషంలో యాసంగిలో కూడా పంటలకు నీటిని విడుదల చేస్తామని ప్రభుత్వం చెప్పడంతో రైతులు యాసంగి సాగుకు సిద్ధమవుతున్నారు.

### ప్రాజెక్టుల వారీగా నీటి కేటాయింపులు

రాష్ట్రస్థాయి సాగునీటి విడుదల ప్రణాళిక కమిటీలో జిల్లాలోని ప్రాజెక్టుల వారీగా ఎన్ని ఎకరాలకు సాగునీరు అందించనున్నారో వివరాలను అధికారులు వెల్లడించారు. జూరాల ప్రాజెక్టు కుడి కాల్వ ద్వారా 15 వేల ఎకరాలకు.. నెట్టెంపాడ్ ప్రాజెక్టు (గుడ్డెందొడ్డి, ర్యాలంపాడ్)పరిధిలో 24,800 ఎకరాలకు, ఆర్డీఎస్ పరిధిలో 37 వేల ఎకరాలకు, ఎత్తిపోతల పథకాల కింద 2,750 ఎకరాలకు సాగునీరు అందించాలని నిర్ణయించారు. 2024లోని డిసెంబర్ 25 నుంచి 2025 మార్చి 15వ తేదీ వరకు నీటిని విడుదల చేయనున్నట్లు కమిటీ వెల్లడించింది. దీంతో ఈ యాసంగి పంటలకు సాగునీటికి ఢోకా ఉండదు. అందుకే ఆరుతడి పంటల వైపు దృష్టి సారించాలని రైతులకు అధికారులు సూచించారు.